
సాక్షి
కాకినాడ
మంగళవారం | 26 | నవంబర్ | 2024





## శంభో శంకర

కార్తిక మాసం చివరి సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊరూవాడా శివనామ స్మరణ మారుమోగింది.


8 లో



## ప్రాణం ఉన్నంత వరకు చదువుతా

ప్రముఖ మానసిక వైద్యుడు, నిత్య విద్యార్థి డాక్టర్ కర్రి రామారెడ్డి తాజాగా 13 కోర్సులు పూర్తి చేసి, అందులో ఆరింటిలో టాపర్స్‌లో ఒకరిగా నిలిచారు.

## డెల్టాలకు 3,700 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 3,700 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. అలాగే మరో 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### బాలాత్రిపుర సుందరి సన్నిధిలో జస్టిస్ భవాని



జస్టిస్ భవానీకి అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈఓ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నగరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వర స్వామిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. జస్టిస్ భవానీకి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ఆలయ విశిష్టతను వివరించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని ఈఓ ఉండవల్లి వీర్రాజు అందజేశారు.

### 28న విధుశేఖర భారతీ మహాస్వామి రాక



తపోవనం స్వామీజీ సచ్చిదానంద సరస్వతి

తుని రూరల్: శృంగేరీ జగద్గురు శంకరాచార్య సంస్థానం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ మహాస్వామి ఈ నెల 28న తాండవ కాశీ క్షేత్రమైన తపోవనానికి రానున్నారు. విజయ యాత్రలో భాగంగా వస్తున్న ఆయన తపోవనం ఆశ్రమంలో నిర్వహించనున్న సువర్ణ భారతీ వేద వేదాంత వేద భాష్య విద్వత్స గోష్ఠి, ధూళి పాదపూజ, మహాగణపతి, రుద్రయాగ పూర్ణాహుతి, మహా ప్రదోష నీరాజనంలో పాల్గొంటారు. తపోవనం ఆశ్రమ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ స్వామి సోమవారం విలేకర్లకు ఈ విషయం తెలిపారు. విద్వత్స గోష్ఠిలో దేశం నలుమూలల నుంచి 70 మంది ప్రధాన పండితులు పాల్గొంటారని చెప్పారు. భక్తులు పాల్గొని గురుదేవతా కృపకు పాత్రులు కావాలని కోరారు.

### పీజీఆర్ఎస్‌కు 413 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజలు 413 సమర్పించారు. వారి నుంచి కలెక్టర్ షణ్మోహన్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్ఓ జె.వెంకటరావు, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, సీపీఓ పి.త్రినాథ్, కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.రత్నమణి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ, పింఛన్లు, బియ్యం కార్డు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఆన్‌లైన్‌లో భూమి వివరాలు నమోదు, ఆక్రమణల తొలగింపు, డ్రైన్లు, కాలువల్లో పూడికల తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికెట్ల మంజూరు వంటి అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. వీటిని నిర్ణీత గడువులోగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

### రాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తి చేయాలి





రాజ్యాంగ విశిష్టతను వివరిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): భారత రాజ్యాంగ స్ఫూర్తిని వ్యాప్తి చేసి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని అనుసరించాలని పాఠశాల విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జేడీ) జి.నాగమణి అన్నారు. జోన్–2 పరిధిలోని 7 జిల్లాల విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన, క్విజ్ పోటీలను స్థానిక గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగమణి మాట్లాడుతూ, రాజ్యాంగం విశిష్టతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాల్సిన ఆవశ్యకత విద్యార్థులపై ఉందన్నారు. డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాజ్యాంగం నిర్దేశించిన హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా పౌరులు అనుసరించాలని సూచించారు. ఈ పోటీల్లో 105 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వీఎస్ఎన్ మూర్తి, బాలల సైన్స్ కాంగ్రెస్ కో ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అన్నదమ్ముల సవాల్

- కాకినాడ 'దేశం'లో అంతర్గత పోరు
- ఎన్నికల తరువాత మారిన సీన్
- తమ్ముడికి అన్నతో తలపోటు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ 'దేశం'లో అన్నదమ్ముల ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. సిటీ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు)కు అన్నీ తానై పార్టీని భుజాన మోసినందుకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయన అన్న సత్యనారాయణ వర్గం కారాలు మిరియాలూ నూరుతోంది. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా అనేక వ్యయప్రయాసలు ఎదుర్కొన్నా, వెన్నంటి నిలవడమే తప్పు అన్నట్టుగా కనిపిస్తోందని వారు అంటున్నారు. తాజా సార్వత్రిక ఎన్నికల ముందు వరకూ అధికారం లేనప్పుడు కొండబాబు వెంట ఉన్న నాయకులు ఎవరు, అధికారం వచ్చాక ఉన్న నేతలు ఎవరో బేరీజు వేసుకోవాలంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి నిన్న మొన్నటి వరకూ కొండబాబు కోసం అందరితో మాటలు పడ్డామనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ముందుకు పోతున్నారని వైరి వర్గం గుర్రుగా ఉంది. గతంలో కూడా ఇలాగే ఒంటెద్దు పోకడలతో రాజకీయం చేసినందుకు తగిన మూల్యం చెల్లించుకున్న అనుభవాన్ని మరచిపోతే ఎలాగని వారు నిలదీస్తున్నారు. అయితే, గతంలో అధికారంలో ఉన్నన్నాళ్లూ ఇంటా బయటా పార్టీ పెత్తనమంతా అప్పగిస్తే ఆ వర్గం చేసిన వ్యవహారాలు జనానికి తెలియంది కాదని కొండబాబు వర్గీయులు బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు.

**ఎన్నికల ముందు నుంచే..**

అన్నదమ్ములైన సత్యనారాయణ, కొండబాబు మధ్య సార్వత్రిక ఎన్నికల ముందు నుంచే విభేదాలకు బీజం పడింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏర్పాటు నేపథ్యంలో కాకినాడ సిటీ అసెంబ్లీ స్థానం టీడీపీకా లేక జనసేనకా అనే మీమాంస మొదట ఎదురైంది. సీట్ల సిగపట్లు మొదలైనప్పటి నుంచీ అన్నదమ్ముల మధ్య ఆధిపత్య పోరుకు తెర లేచింది. కొండబాబు తన సీటు కోసం గట్టి ప్రయత్నాల్లో ఉన్నప్పుడే సత్యనారాయణ తన తనయుడు ఉమాశంకర్‌కు అవకాశం కోసం తెర వెనుక ప్రయత్నాలు జరపడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని కొండబాబు సహా కుటుంబ సభ్యులు సైతం తీవ్రంగా పరిగణించారని అప్పట్లో పార్టీలో విస్తృత చర్చే జరిగింది. ఒకవేళ సిటీ సెగ్మెంట్ టీడీపీకి కాకుండా జనసేన కోటాలోకి వెళ్లిపోతే తనయుడు ఉమ కోసం అక్కడ కూడా ఖర్చీఫ్ వేసేందుకు సత్యనారాయణ ప్రయత్నం చేశారు. ఈ విషయాలు ఆనోటా ఈనోటా తెలుసుకున్న కొండబాబు ఆగ్రహించారని, సోదరుడు సత్యనారాయణను, ఆయన ముఖ్య అనుచరులను పార్టీ కార్యకలాపాలకు దూరం పెట్టారని పార్టీ నేతల మధ్య బహిరంగంగానే చర్చ సాగింది. ఎన్నికలు దగ్గర పడటం, సీటు కొండబాబుకు ఖరారు కావడంతో కుటుంబ సభ్యుల మధ్య రాజీ కుదిరింది. అందరూ కలసి పని చేయాలనే నిర్ణయానికి వచ్చారు. దీంతో సమస్యకు తెర పడిందని పార్టీ శ్రేణులు కూడా భావించాయి. వాస్తవానికి వీరి మధ్య పైకి రాజీ అయితే కుదిరింది కానీ అంతర్గతంగా ఉన్న విభేదాలకు మాత్రం తెర పడలేదు. ఈ అన్నదమ్ముల వర్గాల మధ్య తాజాగా జరుగుతున్న పరిణామాలు ఈ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి. అధికారం దక్కాక కొండబాబు వర్గం ఏకపక్షంగా వ్యవహరిస్తూండటంతో సత్యనారాయణ వర్గీయులు మండిపడుతున్నారు. 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు సిటీలో పలు విభాగాల పర్యవేక్షణ బాధ్యతలను సత్యనారాయణకు అప్పగించగా.. తాజాగా వాటి నుంచి దూరం పెట్టారు. దీంతో వీరి మధ్య వివాదం మరింత ముదురుపాకాన పడింది. ఇది దేనికి దారి తీస్తుందోననే చర్చ జరుగుతోంది. టీడీపీలో అందరి నోటా ఇదే మాట బలంగా వినిపిస్తోంది.

**తాడోపేడో తేల్చుకోవాలని..**

నాడు అధికారంలో ఉన్నప్పుడు మార్కెట్, పోర్టు, పోలీసు వ్యవహారాలను సత్యనారాయణకు అప్పగించారు. అయితే, దీనిని అవకాశంగా తీసుకుని, కొండబాబుకు నష్టం కలిగించేలా దందాలు సాగించారని ఆయన వర్గం ఆరోపిస్తోంది. ఇంత జరిగాక మరోసారి ఎలా ఆ బాధ్యతలు అప్పగిస్తామని కొండబాబు వర్గం ప్రశ్నిస్తోంది. తాజాగా కూడా పోర్టులో పర్యవేక్షణ కార్యకలాపాలను పైకి అప్పగించినట్టే అప్పగించి.. తమ వర్గీయులు ఎవరు వచ్చినా పనులు చేయనవసరం లేదంటూ పరోక్షంగా సంకేతాలిచ్చారని సత్యనారాయణ వర్గం కొండబాబుపై గుర్రుగా ఉంది. ఆయన తీరుతో విసుగెత్తిపోయిన సత్యనారాయణ వర్గం తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడుతోంది. కుమారుడు ఉమను జనసేన పార్టీలో చేర్చడం ద్వారానే కొండబాబు వర్గానికి ముకుతాడు వేసే యోచనలో సత్యనారాయణ వర్గం ఎత్తులకు పై ఎత్తులు వేస్తోందని పార్టీలో విస్తృత ప్రచారం జరుగుతోంది.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

# రత్నగిరిపై భక్త ప్రభంజనం

- సత్యదేవుని దర్శించిన లక్ష మందికి పైగా భక్తులు
- రికార్డు స్థాయిలో 10,718 వ్రతాల నిర్వహణ

అన్నవరం: కార్తిక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా రత్నగిరికి లక్ష మందికి పైగా భక్తులు తరలివచ్చారు. వేకువజామున ఒంటి గంట నుంచి సాయంత్రం వరకూ ఆలయ ప్రాంగణం ఇసుక వేస్తే రాలని విధంగా భక్తజన సందోహంతో నిండిపోయింది. కార్తికంలో చివరి సోమవారం కావడంతో సత్యదేవుని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని ఊహించిన అధికారులు ఆలయాన్ని వేకువజామున ఒంటి గంటకే తెరిచారు. పూజల అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచే స్వామివారి వ్రతాలు కూడా ప్రారంభించారు. రికార్డు స్థాయిలో సత్యదేవుని వ్రతాలు 10,718 జరిగాయి. వీటిలో దాదాపు 70 శాతం రూ.300 టికెట్టుతో జరిగినవే. స్వామివారి వ్రత మండపాలు, నిత్య కల్యాణ, పాత కల్యాణ మండపాలు వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. రద్దీ కారణంగా స్వామివారి అంతరాలయ దర్శనం టికెట్టు తీసుకున్న భక్తులను కూడా వెలుపలి నుంచే దర్శనానికి అనుమతించారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా రావి చెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం, రావిచెట్టు, రామాలయం ధ్వజస్తంభం, జమ్మి చెట్ల వద్ద జ్యోతులు వెలిగించి దీపారాధన చేశారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా దీపకాంతులతో నిండిపోయింది. సుమారు పది వేల మందికి పులిహోర, దద్ధోజనం పంపిణీ చేశారు. తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకూ ఈఓ కె.రామచంద్ర మోహన్ పశ్చిమ రాజగోపురం వద్దనే ఉండి, కంపార్టుమెంట్ల ద్వారా భక్తుల రాకపోకలను పర్యవేక్షిస్తూ సిబ్బందికి సూచనలిచ్చారు. వ్రత మండపాల వద్ద క్యూలను చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించారు.

**1,22,496కు చేరిన సత్యదేవుని వ్రతాలు**

ప్రస్తుత కార్తికంలో సత్యదేవుని వ్రతాలు రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. సోమవారం జరిగిన 10,718తో కలిపి ఇప్పటి వరకూ వ్రతాలు 1,22,496 జరిగాయి. 2023 కార్తికంలో నాలుగో సోమవారంతో కలిపి 97,743 మాత్రమే జరిగాయి. గత ఏడాది కార్తికంతో పోల్చితే ఈసారి 24,753 వ్రతాలు అధికంగా జరిగాయని అధికారులు తెలిపారు.

**రూ.1.05 కోట్ల ఆదాయం**

అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో వ్రతాల ద్వారానే సుమారు రూ.50 లక్షలు సమకూరింది. ప్రసాదం విక్రయాల ద్వారా రూ.45 లక్షలు, మిగిలిన విభాగాల ద్వారా రూ.10 లక్షల చొప్పున ఆదాయం వచ్చింది.

**నేడు కూడా రద్దీ**

కార్తిక బహుళ ఏకాదశి కావడంతో మంగళవారం కూడా రత్నగిరిపై భక్తుల రద్దీ నెలకొనే అవకాశం ఉంది. సుమారు 60 వేల మంది భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు.

# వలంటీర్ల వ్యవస్థ లేదనడం సిగ్గు చేటు

- శాసన మండలిలో మంత్రి ప్రకటన హాస్యాస్పదం
- వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రబాబు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రబాబు

అమలాపురం టౌన్: వలంటీర్ల వ్యవస్థ లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి అనడం సిగ్గు చేటని వలంటీర్ల అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పరుచూరి రాజేంద్రబాబు ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీల ముఖ్య నేతలు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వారి గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలు చేస్తామని హామీలు గుప్పించినప్పుడు మంత్రికి ఆ వ్యవస్థ ఉందని తెలీదా...? అని ప్రశ్నించారు. రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురంలోని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి వలంటీర్ల సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రబాబు మాట్లాడారు. జిల్లా వలంటీర్ల అసోయేషన్ అధ్యక్షుడు కె.సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం వలంటీర్ల మనుగడ, న్యాయ పోరాటం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. శాసనమండలి సాక్షిగా మంత్రి అసలు వలంటీర్ల వ్యవస్థే లేదని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని రాజేంద్రబాబు అన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్యంగా చంద్రబాబు పదే పదే ఇచ్చిన హామీల ప్రకారం వలంటీర్లను కొనసాగించి వారి గౌరవ వేతనాలను రూ.10 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 26 వేల మంది వలంటీర్లు ఆరు నెలలుగా వేతనాలు లేక, కొనసాగించక తీవ్ర అవస్థలు పడుతున్నారని గుర్తు చేశారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం వలంటీర్ల విషయంలో ఇదే అలక్ష్యం కొనసాగిస్తే న్యాయ పోరాటాలకు సిద్ధం కావాలని సమావేశం నిర్ణయించింది.

# రూ.3,01,232 విరాళాలు



దాతకు బాండ్ అందజేస్తున్న సూపరింటెండెంట్

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి డి.వేంకట శ్రీను, వేంకట సూర్యనారాయణ (పులిమేరు) రూ.1,01,116; తేతల శ్రీనివాసరెడ్డి (కుతుకులూరు) రూ.లక్ష; మానుకొండ నాగేశ్వర రావు (మందపల్లి) రూ.1,00,116 చొప్పున సోమవారం విరాళాలు విరాళం సమర్పించారు. వారికి అన్నదానం బాండ్లను రిసెప్షన్ సూపరింటెండెంట్ బలువు సత్య శ్రీనివాస్ అందజేశారు.

# రేపటి నుంచి బాల్య వివాహ ముక్త భారత్

కాకినాడ సిటీ: బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ రాహుల్ మీనా, డీఆర్ఓ జె.వెంకటరావు, ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ తదితరులతో కలిసి జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కార్యక్రమం వచ్చే నెల 10వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, బాలల విద్య వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. లింగ వివక్షకు గురవుతున్న మహిళలకు, చిన్న పిల్లలకు, యువతీ యువకులకు ఆయా చట్టాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జాతీయ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే అంశంపై వాల్‌పోస్టర్‌ను డీఆర్‌డీఏ అధికారులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ ప్రత్యేక కార్యక్రమం వచ్చే నెల 23వ తేదీ వరకూ జరుగుతుందన్నారు.

### హాల్ టికెట్లు నిరాకరిస్తే కళాశాలలపై చర్యలు

కాకినాడ సిటీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏ విద్యార్థికీ హాల్ టికెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించడం చేయరాదని కలెక్టర్ షణ్మోహన్ స్పష్టం చేశారు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని పలు విద్యా సంస్థల యాజమాన్యాలు ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు, తరగతులకు హాజరు కానివ్వకుండా, హాల్ టికెట్లు ఇవ్వకుండా, పరీక్షలకు హాజరయ్యేందుకు ఆటంకం కలిగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కళాశాలలకు నేరుగా విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. పాత బకాయిలు కూడా క్రమంగా చెల్లిస్తామని పేర్కొందన్నారు. ఈ విషయాన్ని కళాశాలల యాజమాన్యాలకు తెలియజేశామని కలెక్టర్ చెప్పారు.

# తప్పెవరిది?

- ప్రైవేటు ఆసుపత్రుల్లో వరుస మరణాలు
- రోగులను కాపాడటంపై శ్రద్ధ లేదని బాధితుల ఆగ్రహం
- రూ.లక్షల్లో గుంజుతున్నారని ఆవేదన
- అపోహలు సరికాదంటున్న వైద్య నిపుణులు

**కోమాలో ఉన్నాడంటూ..**

నిడదవోలులో ఇటీవల క్రిమిసంహారక మందు తాగి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ బాలుడిని సమీప ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం పేరుతో ఆ ఆసుపత్రి యాజమాన్యం రూ.40 వేలు కట్టించుకుంది. పరిస్థితి విషమించి ఆ బాలుడు కోమాలోకి వెళ్లడంతో రాజమహేంద్రవరంలోని ఎమర్జెన్సీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ రెండు రోజులు వైద్యం అందించిన వైద్యులు రూ.1.50 లక్షల వరకూ వసూలు చేశారు. అయినప్పటికీ బాలుడి పరిస్థితి మెరుగుపడలేదు. అతడి పరిస్థితి ఏమిటో వైద్యులు స్పష్టంగా చెప్పలేదు. ఆగ్రహించిన కుటుంబ సభ్యులు ఆ బాలుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మరణించాడు. ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, తమ నుంచి భారీగా డబ్బులు గుంజారని ఆరోపిస్తూ బంధువులు ఆందోళనకు దిగారు.

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్యో నారాయణో హరిః అంటూ వైద్యులను మనం అనాదిగా దేవుడితో సమానంగా భావిస్తాం. విధాత ప్రాణం పోస్తే.. వైద్యులు ఆ ప్రాణం నిలుపుతారనేది చాలా మంది నమ్ముతారు. కానీ, ఇటీవల జిల్లాలో చోటు చేసుకుంటున్న సంఘటనలు ఈ నమ్మకాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో కొన్ని సందర్భాల్లో రోగులు మరణిస్తూండటం.. దీనికి వైద్యుల నిర్లక్ష్యం, ఆసుపత్రుల ధనదాహమే కారణమని ఆరోపిస్తూ వారి బంధువులు ఆందోళనలకు దిగడం కొద్ది రోజులుగా కనిపిస్తోంది. వారికి ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలు ఎంతో కొంత ఇచ్చి సర్దుబాటు చేసుకుంటున్నాయి. దీనికి దారి తీస్తున్న కారణాలపై వైద్య వర్గాల్లో తప్పనిసరిగా చర్చ జరగాల్సిన అవసరముందని పలువురు అంటున్నారు.



ఇటీవల రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రి వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

**ధనార్జనే పరమావధి**

వైద్యం వ్యాపారంగా మారిన ప్రస్తుత కాలంలో సేవా దృక్పథంతో చికిత్స అందించే వైద్యులు చాలా వరకూ కనుమరుగవుతున్నారు. వైద్య విద్య కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి, పట్టా పొందిన వైద్యుల్లో కొంత మంది.. ఆ సొమ్ము, ఆసుపత్రి నిర్మాణ పెట్టుబడి తక్కువ వ్యవధిలోనే ఎలా రాబట్టుకోవాలనే దానిపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే ఆసుపత్రికి వచ్చిన రోగులను డబ్బు కోసం పీడిస్తున్నారనే అపవాదు వస్తోంది. మరోవైపు రోగుల ప్రాణాలను రక్షించుకునేందుకు వారి బంధువులు సాధ్యమైనంత వరకూ ఖర్చుకు వెనుకాడరు. వారి తపనే ఆసుపత్రులకు కాసులు కురిపిస్తోంది. ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి ప్రతి అడుగూ తమ కనుసన్నల్లోనే పడాలనే భావనతో అక్కడి సిబ్బంది ఉంటారు. ఓపీ చీటీ రాయించుకున్నప్పటి నుంచి రోగిని, వారి బంధువులను మానసికంగా సిద్ధం చేస్తారు. ఓపీలో ఓపికగా వైద్యుని కోసం నిరీక్షించాలి. ఈలోగా వైద్యుడు బయటకు వస్తే రోగి సైతం వినయంతో లేచి నిలబడాలన్నట్టుగా సిబ్బంది వ్యవహార శైలి ఉంటుంది.

**అవసరం లేకపోయినా పరీక్షలు!**

ఓపీ అనంతరం వైద్యులు రాసే వైద్య పరీక్షలతో దోపిడీ మొదలవుతుంది. జ్వరంతో ఆసుపత్రికి వెళ్లే రోగికి అవసరానికి మించి వైద్య పరీక్షలు చేయించి సొమ్ము చేసుకుంటున్నారన్న అపవాదు కొన్ని ప్రైవేటు ఆసుపత్రులపై ఉంది. వైద్యుడు రాసిన రక్త పరీక్షలన్నీ ఆసుపత్రిలోని ల్యాబ్ లోనే చేయించాలని, బయట చేయిస్తే ఫలితాలు సక్రమంగా ఉండవని సిబ్బంది చెబుతూంటారు. కొంతమంది వైద్యులు అవసరం లేకపోయినా ఎంఆర్ఐ, సీటీ స్కాన్, కలర్ డాప్లర్ వంటి ఖరీదైన టెస్టులు రాస్తూంటారనే ఆరోపణలున్నాయి. వీటిని బయట ఆధునిక పరికరాలున్న ప్రైవేటు ల్యాబ్‌లలో చేయించినా.. సిఫారసు చేసిన వైద్యుడికి ఆ ల్యాబ్ నుంచి 30 నుంచి 40 శాతం వరకూ కమీషన్ వెళ్లాల్సిందే. ఇదంతా లోపాయికారీ ఒప్పందం ప్రకారం జరిగిపోతూంటుంది. ఆసుపత్రికి రోగులను తీసుకువచ్చే గ్రామీణ వైద్యులకు కూడా రోగి చెల్లించిన బిల్లులో 20 శాతం తగ్గకుండా కమీషన్ ముట్టజెబుతారన్నది బహిరంగ రహస్యమే.

**మందుల్లో సైతం..**

రోగ నిర్ధారణ అనంతరం వైద్యులు రాసే మందులను కూడా ఆయా ఆసుపత్రులకు అనుబంధంగా ఉన్న మందుల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. చాలా మందులు బయట కొందామన్నా దొరకవు. వైద్యులు రాసిన మందులు కొన్న వెంటనే అక్కడి సిబ్బందికి చూపించాలి. కొన్ని రకాల మందులు ఆయా కంపెనీలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం వైద్యుడు సూచించిన పేరుతో తయారవుతూంటాయి. అవి ఆ ఆసుపత్రిలో మాత్రమే లభ్యమవుతాయి. కొన్ని రకాల మందులు తరచుగా రాసే వైద్యులకు ఆయా కంపెనీలు భారీగా కానుకలు సమర్పిస్తూంటాయి.

### సేవాలోపం ఉంటే చర్యలు తీసుకుంటాం



వైద్యంలో నిర్లక్ష్యం కారణంగా రోగి మృతి చెందినట్లు ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం. కొన్ని ఆసుపత్రుల్లో అధికంగా బిల్లులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. విచారణ చేస్తున్నాం. ఆసుపత్రుల్లో ఎటువంటి సేవాలోపం ఉన్నా మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం. ఇటీవల జిల్లాలో జరిగిన సంఘటనలపై విచారణ చేస్తున్నాం. కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తాం.

– వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, రాజమహేంద్రవరం

### దాడులు చేయడం నేరం



వైద్యుల నిర్లక్ష్యం కారణంగా రోగి మృతి చెందినట్లు భావిస్తే బాధితులు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. దీనిపై సంబంధిత వైద్యాధికారులతో దర్యాప్తు చేయిస్తాం. నేరం నిరూపణ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తగు చర్యలు తీసుకుంటారు. ఆసుపత్రులపై దాడులు చేయడం నేరం. అలా దాడులకు దిగిన రోగి బంధువులపై చర్యలు తీసుకుంటాం.

– డి.నరసింహ కిశోర్, జిల్లా ఎస్పీ

### ఆందోళనకు దిగడం మంచిది కాదు



ఏ ఆసుపత్రిలోనూ అనవసరంగా వైద్య పరీక్షలు చేయరు. రోగి కోలుకోవాలన్న లక్ష్యంతో వైద్యులు చికిత్స అందిస్తారు. ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నిస్తారు కానీ ప్రాణం పోయలేరు కదా! రోగులు కూడా తమ స్తోమతకు మించి పెద్ద పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేర్చి, బిల్లుల విషయంలో ఆందోళనకు దిగడం మంచిది కాదు. దీనివల్ల వైద్యులు అభద్రతా భావానికి గురై, సేవాలోపం జరిగే ప్రమాదం ఉంటుంది.

– డాక్టర్ గురుప్రసాద్, ఐఎంఏ అధ్యక్షుడు, రాజమహేంద్రవరం

## క్లుప్తంగా

### సివిల్స్ ఉచిత శిక్షణకు 27న స్క్రీనింగ్ పరీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు స్థానిక వెనుకబడిన తరగతుల అధ్యయన కేంద్రంలో నవంబర్ 27 స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కేఎన్ జ్యోతి సోమవారం తెలిపారు. ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాలకు చెందిన దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్క్రీనింగ్ పరీక్షలకు హాజరు కావాలని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించనున్న 'సివిల్స్' ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి జిల్లాలకు చెందిన అభ్యర్థులందరూ స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలని ఆమె సూచించారు.

### లారీని ఢీకొన్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు


దెబ్బతిన్న బస్సు ముందుభాగం

నల్లజర్ల: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. డ్రైవర్‌తో సహా పలువురికి గాయాలయ్యాయి. గుంటూరు నుంచి విశాఖ 30 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఈ బస్సు సోమవారం తెల్లవారుఝామున అనంతపల్లి–వీరవల్లి టోల్‌ప్లాజా మధ్య ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో బస్సు డ్రైవరు కుంబరుకుంట రవిచంద్రప్రకాష్ ఎడమ కాలుకు తీవ్ర గాయం కావడంతో అతనిని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్పగాయాలైన తొమ్మిది మంది ప్రయాణికులను ఏలూరు, రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రులకు హైవే అంబులెన్స్‌లో తరలించారు. మంచుకురవడంతో ఎదుట ఉన్న వాహనం కనపడక పోవడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సోమరాజు తెలిపారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి: అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై జగన్మోహన్‌రావు సోమవారం తెలిపారు. శృంగవృక్షం గ్రామానికి చెందిన బోయిడి బాబూరావు(31) అప్పుల కారణంగా ఆదివారం పొలంలో పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు తునిలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

# శంభో శంకర


కార్తిక సోమవారం సందర్భంగా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానాలు చేస్తున్న భక్తులు

కార్తిక మాసం చివరి సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఊరూవాడా శివనామ స్మరణ మారుమోగింది. ఆయా గ్రామాల్లోని అయ్యప్పస్వాములు, పిల్లలు, పెద్దలు, మహిళలు శివాలయాలకు వెళ్లి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన చేయించుకున్నారు. తెల్లవారు జాము నుంచే సమీపంలోని పుష్కరిణుల్లో సాన్నాలు చేసి అరటి దొప్పల్లో దీపాలు వదిలారు. పురోహితులకు దీప, ఉసిరి, వస్త్ర, సాలగ్రామ, స్వయంపాక తదితర దానాలు చేశారు. సాయంత్రం మరోసారి శివయ్యను దర్శించి ఉపవాస దీక్షను విరమించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద ప్రత్యేక దీపాలంకరణలు చేశారు. అన్నదానాలు నిర్వహించారు. బిక్కవోలు మండలం ఆరికరేవులలో 54 పార్థివ శివలింగాలను మహిళలు తలపై ఉంచుకొని ఊరేగించారు.


ప్రత్యేకాలంకరణలో సామర్లకోటలోని కుమారారామ భీమేశ్వరస్వామి


ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


భక్తులతో కిటకిటలాడుతున్న పిఠాపురంలోని పాదగయ క్షేత్రం


కొవ్వూరు గోష్పాద క్షేత్రం స్నానఘట్టంలో పూజలు చేస్తున్న భక్తులు


బిక్కవోలు మండలం ఆరికరేవులలో శివలింగాల ఊరేగింపులో పాల్గొన్న మహిళలు


ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రవేశ ద్వారం నుంచి ప్రధాన రహదారిపై వరకు క్యూ లో ఉన్న భక్తులు

## ఆస్పత్రికి వెళుతూ అనంతలోకాలకు..

- వ్యాన్ ఢీకొని తండ్రి మృతి
- కుమారుడికి తీవ్ర గాయాలు

గండేపల్లి: కన్న కొడుకుని ఆస్పత్రికి తీసుకువెళుతుండగా జరిగిన ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. గండేపల్లి ఎస్సై యూవీ శివ నాగబాబు వివరాల మేరకు కిర్లంపూడి మండలం జగపతినగరానికి చెందిన తాటిపాక గంగరాజు (28) భార్యాపిల్లలతో రంగంపేటలోని కోళ్లఫారంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అతని కుమారుడు అనిల్ అనారోగ్యానికి గురికావడంతో స్కూటీపై రంగంపేట మండలం ఆనూరులోని ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు బయలుదేరాడు. రామేశంపేట వైపు నుంచి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మినీ వ్యాన్ స్కూటీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగరాజు తలకు బలమైన గాయమై, కుడికాలు నుజ్జయి అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్ రోడ్డుపై పడిపోవడంతో కుడికాలుకు తీవ్ర గాయమైనట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మృతుని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.


ఘటనా స్థలంలో గంగరాజు మృతదేహం

## ఉత్సాహంగా కరాటే పోటీలు

రామచంద్రపురం: పట్టణంలోని ఆర్‌సీఎం ప్రాంగణంలో 24వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. కరాటే మాస్టర్ బీకే రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుంచి వేయిమందికి పైగా బాలబాలికలు పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు పట్టణ ప్రముఖులు నల్లమిల్లి జనార్ధనరెడ్డి(చంటి రెడ్డి), జీవీ రావు, జి.ఆనందబాబు, బాబులు రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జట్టు 420 పాయింట్లతో మొదటి స్థానం కైవసం చేసుకోగా, 200 పాయింట్లతో విశాఖ జిల్లా రెండవ స్థానంలోను, 150 పాయింట్లతో కాకినాడ జిల్లా, 115 పాయింట్లుతో తూర్పుగోదావరి జిల్లాలు తరువాతి స్థానాల్లో నిలిచాయని రత్నం తెలిపారు. బాలుర బ్లాక్ బెల్ట్ సీనియర్ విభాగంలో పి.గణేష్ మొదటి స్థానం, బి.రవితేజ రెండవ స్థానం, బాలికల బ్లాక్ బెల్ట్ విభాగంలో కె. లేఖ నిహారిక మొదటి స్థానం, ఎస్‌కే రిణా రెండవ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. గెలుపొందినవారికి ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు.


మొదటి స్థానంలో నిలిచిన కోనసీమ జిల్లా జట్టుతో నిర్వాహకులు

### చోరీ కేసులో రెండేళ్ల జైలు

కొవ్వూరు: పట్టణంలోని గౌతమీనగర్‌లో 2022 సెప్టెంబర్ ఆరో తేదీ రాత్రి దూళిపాళ్ల గోపాల దక్షిణామూర్తి ఇంట్లో చోరీకి పాల్పడిన కేసులో తిరివీధి సురేంద్ర అనే వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష పడినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూర్ గ్రామానికి చెందిన సురేంద్ర రూ.2.40 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల చోరీకి పాల్పడ్డాడు. అప్పటి పట్టణ పోలీసు స్టేషన్‌లో సీఐ ఏఎల్ఎస్ రవి కుమార్ కేసు నమోదు చేశారు.
విచారణలో సురేంద్రపై నేరం రుజువు కావడంతో సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు. ప్రాసిక్యూషన్ తరపున డి.బాబూరావు వాదించారు.

## 163 కిలోల గంజాయి స్వాధీనం

కిర్లంపూడి: మండల పరిధి సోమవరం జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న 163 కేజీల గంజాయిని సోమవారం కిర్లంపూడి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ తన సిబ్బందితో సోమవరం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. వైజాగ్ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గూడ్స్ వ్యాన్‌ను తనిఖీ చేయగా నాలుగు బస్తాలతో ఉన్న 163 కేజీల గంజాయిని గుర్తించారు. తమిళనాడుకు చెందిన రంగస్వామి సత్యానందం, నవమాని గురుస్వామి(నటరాజ్)ను అదుపులోకి తీసుకుని, వాహనాన్ని, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ప్రత్తిపాడు కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించారు. వారిని సబ్ జైలుకు తరలించామని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

## అన్నవరం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా త్రినాథరావు

### దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్‌గా రామచంద్రమోహన్ కొనసాగింపు


రామచంద్రమోహన్


త్రినాథరావు

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ (ఫుల్ అడిషనల్ చార్జి)గా సింహాచలం దేవస్థానం ఈఓ వీ త్రినాథరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా పనిచేస్తున్న దేవదాయ, ధర్మాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్‌ను ఆ బాధ్యతల నుంచి తొలగించారు. దేవదాయ, ధర్మదాయశాఖ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.
ఇన్‌చార్జి ఈఓగా నియమితులైన వి.త్రినాథరావు 2018 డిసెంబర్ 31 నుంచి 2019 ఏప్రిల్ నాలుగో తేదీ వరకు, 2019 ఆగస్టు 25 నుంచి నుంచి 2022 జూలై రెండోతేదీ వరకు అన్నవరం దేవస్థానం ఈఓ గా పనిచేశారు. ఆ తరువాత ద్వారకా తిరుమల దేవస్థానం ఈఓగా బదిలీ అయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సింహచలం దేవస్థానం ఈఓగా నియమితులయ్యారు. మూడోసారి అన్నవరం దేవస్థానం (ఇన్‌చార్జి) ఈఓగా నియమితులయ్యారు.

**గతంలోనే కోరిన రామచంద్రమోహన్**

కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తున్న తనను అన్నవరం దేవస్థానం ఈఓ బాధ్యతల నుంచి తప్పించాలని రామచంద్రమోహన్ చాలాకాలంగా కోరుతున్నారు. దేవదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖకు సంబంధించిన పాలనా పరమైన బాధ్యతలన్నీ ఆయనే నిర్వహిస్తున్నారు. వారానికి నాలుగు రోజులు విజయవాడలో, రెండు రోజులు అన్నవరం దేవస్థానంలో ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కార్తికమాస ఏర్పాట్లకు అనుభవజ్ఞుడైన అధికారి ఉండాలన్న అభిప్రాయంతో ఆయనను రెండు పోస్టులలోను కొనసాగించారు. కార్తికమాస నాలుగో సోమవారం హడావుడి కూడా ముగియడంతో మిగిలిన ఆరు రోజులు భక్తులు ఒక మాదిరిగా మాత్రమే ఉంటారు. ఆ కారణంగా రామచంద్రమోహన్‌ను అన్నవరం బాధ్యతల నుంచి తప్పించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**మంగళగిరి పానకాల స్వామి ఆలయం అభివృద్ధి అధికారిగా ?**

మంగళగిరిలోని ప్రముఖ దేవస్థానమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి (పానకాల స్వామి) దేవాలయాన్ని యాదగిరి గుట్ట ఆలయ స్థాయిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దానికి ప్రత్యేక అధికారిగా రామచంద్రమోహన్ ను నియమించనున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం.



## రేపు నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో బుధవారం ఉదయం 9.00 గంటల నుంచి నిధి ఆప్‌కే నికత్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్–2 వైడి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండలోని చెరుకూరి విద్యాలయం, కాకినాడ జిల్లాలో లోవలోని శ్రీతలుపులమ్మదేవాలయంలోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ద్రాక్షారామ పీఏసీఎస్‌లోను, ఏలూరు జిల్లాలో గుండుగొలను దగ్గర ముప్పవరంలోని నాగహనుమాన్ సాల్వెంట్ ఆయిల్స్‌లోను, పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాలలో దివెంకటస్వామినాయుడు పీఏసీఎస్‌లోను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వై.రామవరంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, గంగవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోను, మారేడుమిల్లులోని ఏపీట్రైబల్ వెల్ఫేర్ బాలుర స్కూల్లోను నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మోసాల నివారణ, విజిలెన్స్, ఇ-పాస్‌బుక్‌పై అవగాహన కల్పిస్తారన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలని కోరారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చని తెలిపారు.

## ప్రాణం ఉన్నంత వరకు చదువుతా

- కొత్తగా 13 కోర్సులు పూర్తిచేసి ఆరింటిలో టాపర్‌గా నిలిచిన డాక్టర్ రామారెడ్డి
- 50 డిగ్రీలు పూర్తి చేసిన నిత్య విద్యార్థికి పలువురి అభినందన


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కర్రి రామారెడ్డి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రముఖ మానసిక వైద్యుడు, డాక్టర్ బీసీ రాయ్ పురస్కార గ్రహీత డాక్టర్ కర్రి రామారెడ్డి నిరంతర విద్యాప్రయాణానికి ప్రేరణగా నిలుస్తూ, మరో విశిష్ట మైలురాయి చేరుకున్నారు. తాజాగా 13 కోర్సులు పూర్తిచేసి, అందులో ఆరింటిలో టాపర్స్‌లో ఒకరిగా నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక దానవాయిపేటలోని మానస ఆసుపత్రిలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆ వివరాలను వెల్లడించారు. దీనికి మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, ఆర్‌ఆర్‌ఎస్ ప్రాంత కార్యకారిణి ఓలేటి సత్యనారాయణ, ఐఎంఏ నగర అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్ హాజరయ్యారు. డాక్టర్ రామారెడ్డి మాట్లాడుతూ ఒకే సెమిస్టర్‌లో జూలై నుంచి డిసెంబరు 2024లో 11 ఎన్‌పీటీఈఎల్ కోర్సులు, దాంతో పాటు రెండు ఎన్‌పీటీఈఎకల్ ప్లస్ కోర్సులు కూడా కలిపి 13 కోర్సులు ఒక్కసారే చేశానన్నారు. ఈ 11 ఎన్‌పీటీఈఎల్ కోర్సుల్లో ఆరింటిలో టాపర్లలో ఒకడిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఒకే సెమిస్టర్‌లో ఏదైనా మూడు కోర్సులకు టాపర్‌గా వస్తే ఎన్‌పీటీఈఎల్ సూపర్ స్టార్ విభాగంలో చేరుస్తారని, ఆరు కోర్సులలో టాపర్‌గా వచ్చి ఆ కేటగిరీకి అర్హత సంపాదించానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇలా అన్ని కోర్సులు కూడా ప్రథమశ్రేణికి, డిస్టింక్షన్‌కి సమానం అని, వీటిలో 90 శాతం పైగా మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఎన్‌పీటీఈఎల్ అంటే ఐఐటీల సముదాయమని, 11 రెగ్యులర్ ఎన్‌పీటీఈఎల్ కోర్సులలో 4 కాన్పూర్ ఐఐటీలో, 3 రూర్కీ ఐఐటీలో, 2 మద్రాస్ ఐఐటీలో పూర్తిచేశానన్నారు. ఈ పరీక్షలన్నీ రాజీవ్ గాంధీ కాలేజీ కేంద్రంలో రాశానని, దీనికిగాను కళాశాల అధినేత హర్షకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రూర్కీ ఐఐటీలో, కాన్పూర్ ఐఐటీలో ఒక్కొక్కటి చొప్పున రెండు ఎన్‌పీటీఈఎల్ ప్లస్ కోర్సులు పూర్తి చేశానన్నారు. ఈ సరికొత్త విజయంతో పాటు ఇప్పటికే సాధించిన కోర్సులు, డాక్టరేట్లు, పీజీలు, డిగ్రీలు, డిప్లమాల సర్టిఫికెట్లు అన్నీ కలిపి 50 పూర్తయ్యాయన్నారు. ఇందులో ఏ ఒక్కటి కూడా హానరరీ డిగ్రీ, ఫెలోషిప్, పదవి వల్ల వచ్చినవి మాత్రం కాదని డాక్టర్ రామారెడ్డి స్పష్టం చేశారు. ఊపిరి ఉన్నంతవరకు నా విద్యా ప్రస్థానం కొనసాగుతూనే ఉంటుందని డాక్టర్ రామారెడ్డి అన్నారు. మాజీ ఎంపీ హర్ష కుమార్ మాట్లాడుతూ ఒకే రంగంలో డిగ్రీలు చేయడం చూస్తుంటామని, ఒకదానికి ఒకటి సంబంధమే లేకుండా డాక్టర్ రామారెడ్డి చేస్తున్న డిగ్రీలు మామూలు విషయం కాదన్నారు. ఇటువంటి వ్యక్తి మన రాజమండ్రికి చెందడం మనందరికీ గర్వకారణమన్నారు. డాక్టర్ గురు ప్రసాద్ మాట్లాడుతూ చిన్నతనం నుంచి రామారెడ్డి విజయాలను చూసి ఎదిగానని , ఇలాంటి వ్యక్తి ఇక్కడ ఉండడం అందరికీ గర్వకారణమన్నారు.